

చినవెంకన్న సన్నిధిలో హీరో సాయిధరమ్ తేజ్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ సినీహీరో సాయిధరమ్ తేజ్ ద్వారకాతిరుమల చినవెంకన్నను బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద పండితులు వేద ఆశీర్వాదం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందచేశారు.



ఆలయంలో సాయిధరమ్‌తేజ్

ఆగస్టు గడిస్తేనే.. భయం వీడేది..!

గోదావరి వరద బాధితుల్లో తొలగని బెంగ

ప్రస్తుతం గోదావరి వరద తగ్గుముఖం

సాధారణ స్థాయికి నీటిమట్టాలు

నేటికీ ఆందోళనలోనే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు

వణికిస్తున్న గతేడాది అనుభవాలు

ఈనెలంతా పునరావాస కేంద్రాల్లోనే ఉంటాం : ముంపు బాధితులు

ఈ సారైనా ప్రభుత్వం పట్టించుకునేనా..!



వరద ముంపులో కుక్కునూరు మండలంలోని గ్రామం (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద ప్రస్తుతం తగ్గుముఖం పట్టినప్పటికీ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల్లో వరద భయం మాత్రం వీడలేదు. గతేడాది అనుభవాలు అక్కడి ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. ఆగస్టు గడిస్తే తప్ప వరద ప్రమాదం వీడినట్లు కాదని అప్పటి వరకూ పునరావాస శిబిరాల్లోనే తలదాచుకుంటామని, ప్రభుత్వం ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు. వరద తగ్గిందని ప్రభుత్వం బాధితులను వదిలేస్తుందో.. ఆదుకుంటుందో చూడాల్సి ఉంది.. గతేడాది జూలై రెండోవారంలో గోదావరికి పెద్దఎత్తున వరద వచ్చిపడింది. ఇళ్లపైకప్పుల నుంచి వరదనీరు పారింది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 107 నివాసిత ప్రాంతాలుండగా దాదాపు 95 నివాసిత ప్రాంతాలు నీటమునిగాయి. 20 వేల మంది నిరాశ్రయులు పునరావాస కేంద్రాలకు చేరారు. జూలై నెలఖారుకు వరద తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరిపీల్చుకుని గ్రామాలకు పయనమయ్యారు. పట్టుమని పదిరోజులు గడవకముందే ఆగస్టు తొమ్మిదో తేదీ నుంచి మళ్లీ గోదావరి వరద ఉధృతి కొనసాగింది. దీంతో గ్రామాలకు వెళ్లినవారంతా మళ్లీ తట్టాబుట్టా సర్దుకుని పునరావాస శిబిరాలకు చేరారు. దాదాపు ఆగస్టు 20వ తేదీ వరకూ వరద ఉధృతి కొనసాగింది. గ్రామాల మధ్యరాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బాధితులు నెలలతరబడి పునరావాస శిబిరాల్లోనే ఉండాల్సి వచ్చింది. తొలుత 20 కిలోల బియ్యం, నాలుగు రకాల కూరగాయాలు, వంట నూనెప్యాకెట్, కందిపప్పు, రూ.రెండు వేలు నగదు మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ప్రభుత్వ అందించిన సాయం పట్టుమని పదిరోజులు కూడా చాలని పరిస్థితి ఏర్పడింది. తర్వాత పునరావాస కేంద్రాల్లోని వరద బాధితుల గురించి ప్రభుత్వంపెద్దగా పట్టించుకోలేదు. దీంతో దాతల చేసిన సాయంతోనే అంతా ఆకలితీర్చుకుని కాలం వెళ్లదీసిన పరిస్థితి నెలకొంది.

ఈ నెలఖారు వరకూ పునరావాస శిబిరాల్లోనే ఉంటామంటున్న బాధితులు

ప్రస్తుతం గోదావరి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం, పోలవరం కాపర్‌డ్యాం వద్ద నీటిమట్టాలు సాధారణ స్థాయికి చేరాయి. రోడ్లపై నీరు తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల్లో మాత్రం వరద భయం వీడటం లేదు. ప్రస్తుత వరదకు భద్రాచలం వద్ద నీటిమట్టం 56 అడుగులకు చేరుకునేసరికే రెండు మండలాల్లో 45 నివాసిత ప్రాంతాలు ముంపులో చిక్కుకున్నాయి. 13,764 మంది వరద బాధితులు పునరావాస శిబిరాలకు చేరారు. ప్రస్తుతం వరద తగ్గినప్పటికీ గ్రామాలకు వెళ్లేందుకు వీరంతా జంకుతున్నారు. అందుకు ప్రధాన కారణం గతేడాది అనుభవాలే. ఆగస్టులో మళ్లీ గోదావరికి వరద వచ్చే ప్రమాదం ఉంది. గతేడాది అదే జరిగింది. గ్రామాలకు వెళ్లాక మళ్లీ వరద వస్తే సామగ్రి సర్దుకుని పునరావాస శిబిరాలకు రావడమంటే ఖర్చుతో కూడుకున్న పని. ఇప్పటికే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న వరద బాధితులకు ఇది చాలా ఇబ్బందికర పరిణామం. కాబట్టి ఆగస్టు నెలఖారు వరకూ పునరావాస శిబిరాల్లోనే ఉంటామని, తర్వాత గ్రామాలకు వెళ్తామని బాధితులు చెబుతున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉండే వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందో లేదోనన్న భయం మాత్రం అందరినీ వెంటాడుతుంది. ఆగస్టు తర్వాతగానీ రెండు మండలాల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కావు. అప్పటి వరకూ చేసుకునేందుకు పని కూడా ఉండదు. ప్రభుత్వం ఆదుకోకపోతే వరద బాధితులు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పునరావాస పరిహారం ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం వరద బాధితులగా మారిన నిర్వాసితులకు అండగా నిలవాలని అంతా కోరుతున్నారు.

7,8 తేదీల్లో విఆర్‌ఎల సామూహిక రిలేదీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విఆర్‌ఎల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏలూరు కలెక్టర్ కార్యాలయం ముందు సామూహిక రిలే దీక్షలు చేపడుతున్నట్లు విఆర్‌ఎ సంఘం జిల్లా అధ్యక్షులు బ్రహ్మజీ తెలిపారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో బ్రహ్మజీ అధ్యక్షతన ఏలూరు, నూజివీడు డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విఆర్‌ఎ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విఆర్‌ఎలు పోరాడి సాధించుకున్న డిఎను ఈ ప్రభుత్వం రికవరీ చేయడం దారుణమన్నారు. రికవరీ చేసిన డిఎను తిరిగి విఆర్‌ఎ ఖాతాల్లో వేయించాలని ఆయన డిమాండ్ చేశారు. సిఎం జగన్ ప్రతిపక్ష నేతగా విఆర్‌ఎ దీక్షలకు మద్దతుగా పాల్గొని తాము అధికారంలోకి రాగానే రూ.15 వేలకు జీతం పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణం ఆయన ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎ సంఘం జిల్లా కోశాధికారి గంగాధరరావు మాట్లాడుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లో డ్రైవర్, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులను విఆర్‌ఎల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎ సంఘం జిల్లా నాయకులు ఆర్.వెంకటేశ్వరరావు, నరసయ్య, ఫకీరు, కరుణాకర్, మున్సర్, ప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏడాదైనా అందని వరద సాయం

ప్రజాశక్తి - కుక్కునూరు

గతేడాది వచ్చిన గోదావరి వరదలకు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో కొండగుట్టలపై, అడవుల్లో తినడానికి తిండి లేక ఉండటానికి ఇల్లు లేక రెండు నెలల పాటు తీవ్ర ఇబ్బందులు పడుతూ దుర్భర జీవితం గడిపిన ఉప్పర మద్దిగట్ల గ్రామ వరద బాధితులకు నేటికీ వరద సాయం అందలేదని ఎంఎల్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ ప్రభుత్వ తీరును విమర్శించారు. ఉప్పర మద్దిగట్ల గ్రామంలో వరదలకు తీవ్రంగా నష్టపోయిన వరద బాధిత కుటుంబాలకు ఇంటినష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ బుధవారం తహశీల్దార్ ప్రమద్దారుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ గతేడాది వరద బాధితులకు పూర్తిగా వరద సాయం అందలేదని, మళ్లీ వచ్చిన వరదలతో ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వరద సాయంకోసం పలుమార్లు అధికారులచుట్టూ తిరిగినా ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జి.రాజ్‌కుమార్, సామ్రాజ్యం, రమణమ్మ, శ్రీకాంత్, మురళీ, చంద్రశేఖర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, ప్రజలు

మణిపూర్‌లో మారణకాండకు నిరసనగా శాంతిర్యాలీ

ప్రజాశక్తి - చింతలపూడి

మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమానికి నిరసనగా చింతలపూడి పట్టణంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. చింతలపూడి ఆర్‌సిఎం చర్చి వద్ద బయలుదేరి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మూడు నెలల నుంచి విరామం లేకుండా అరాచకాలు జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం అన్యాయమన్నారు. ఈ శాంతి ర్యాలీకీ ముస్లిము మహిళలు మద్దతు పలికారు. శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో మండలంలోని దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదివాసీ గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో కెఆర్‌పురం ఐటిడిఎ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సంఘం జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ప్రజలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతులు సంవత్సరాల తరబడి సాగు చేసుకుంటున్నా 2006 చట్ట ప్రకారం పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం తాత్సారం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బి.వినోద్, ముత్యాలమ్మ, బుచ్చమ్మ, సీత, కృష్ణ, శ్రీరాములు, గంగరాజు, ముత్యాలరావు పాల్గొన్నారు.

బాధితులందరికీ వరదసాయం : జెసి

ప్రజాశక్తి - వేలేరుపాడు

వేలేరుపాడు మండలం చిగురుమామిడి, బోయినపల్లి వరద ప్రభావిత గ్రామాల్లో బుధవారం జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పర్యటించారు. ఈ సందర్భంగా సంబంధిత గ్రామస్తులతో మాట్లాడుతూ వారికి ప్రభుత్వం తరపున అందిన నిత్యావసర వస్తువుల, కూరగాయల పంపిణీపై ఆరాతీశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. చిగురుమామిడి గ్రామంలో దాసరియొని మంగమ్మను జెసి పరామర్శించి వారికి అందిన నిత్యావసర వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ ఆసామి జీలుగుమిల్లి మండలం చల్లవారిగూడెం నిర్వాసితుల కాలనీలో నివాసం ఉంటున్న ఈనెల ఒకటో తేదీన 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, ఐదున్నర కిలోల కూరగాయలు పొందినట్లు తెలిపారు. అనంతరం వేలేరుపాడు మండలం చిగురుమామిడికి చెందిన 190 కుటుంబాలు, జంగారెడ్డిగూడెంలోని నిర్వాసిత కాలనీలో తల దాచుకున్నారు. వారికి నిత్యావసరాల సరుకుల పంపిణీపై జెసి దర్యాప్తు చేశారు. ఈ సందర్భంగా వారి ప్రత్యేకంగా రెండు ఆటోల్లో చల్లావారిగూడెం, బొర్రంపల్లికి నిత్యావసర వస్తువులు తీసుకువెళ్లి పంపిణీ చేసినట్లు గుర్తించారు. చిగురుమామిడికి చెందిన చంద్రుగొండ్ల వరలక్ష్మి తాను నిత్యావసర వస్తువులు పొందినట్లు జెసికి వివరించారు. వేలేరుపాడు మండలం కట్కూరు, కోయిదా పంచాయతీల పరిధిలో 15 గ్రామాల్లో రోడ్లన్నీ వరద ముంపునకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బంది కావడంతో ప్రభుత్వం వెంటనే యుద్ధప్రాతిపదికన ఐదు ఫిషర్‌మెన్ బోట్స్, ఆరు ఎస్ డిఆర్ఎఫ్ బోట్లు, రెండు లాంచీల ద్వారా నిత్యావసరవస్తువులు ఆ గ్రామాలకు తీసుకువెళ్లి వరద బాధితులకు మూడు నెలల ముందస్తు బియ్యం పంపిణీ చేశామని జెసి తెలిపారు. కోయిదాలో 537, కట్కూరులో 328 కుటుంబాలకు ముందుగా కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, ఈనెల ఒకటో తేదీన పంపిణీ చేశామన్నారు. 25 కేజీల చొప్పున బియ్యం ప్రస్తుతం పంపిణీ జరుగుతుందన్నారు. నిత్యావసర సరుకుల సంబంధించి వేలేరుపాడు మండలంలో 3742, కుక్కునూరు మండలంలో 2584 మొత్తం 6,326 మంది వరద బాధితులను గుర్తించి 97 శాతం ఇప్పటికే పంపిణీ జరిగిందన్నారు.



వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న జెసి

గ్రీన్ సిటీ రోడ్డు అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని గ్రీన్ సిటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడానికి అంచనాలు తయారు చేసినట్లు నగర కమిషనర్ సంక్రాంతి కృష్ణ తెలిపారు. అధికారుల ఆమోదం పొందిన తదుపరి త్వరితగతిన పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు. ప్రజాశక్తి దినపత్రికలో ఇటీవల ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో 'గ్రీన్ సిటీ రోడ్లు బాగుచేస్తేనే ఓట్లేస్తాం' అని ప్రచురితమైన వార్తకు కమిషనర్ స్పందించారు. గ్రీన్‌సిటీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రకటనలో తెలిపారు. ఈ వివరణను జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు.

ఏలూరు అభివృద్ధికి రూ.361.55 కోట్ల అమృత్ నిధులు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి రూ.361.55 కోట్ల అమృత్ నిధులు మంజూరయ్యాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు శాసన సభ్యులు ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్(నాని) తెలిపారు. ఈ నిధులతో ఏలూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఏలూరుకు నిర్దేశించిన రూ.361.55 కోట్ల అమృత్ నిధుల కేటాయింపుల్లో రూ.129.20 కోట్లతో విలీన గ్రామాల్లో సురక్షిత తాగునీరు సరఫరా, రూ.23.79 కోట్లతో జగనన్న కాలనీల్లో సురక్షిత తాగునీటి సరఫరా, రూ.112.18 కోట్లతో నగరంలో మురుగునీటిపారుదల వ్యవస్థ మెరుగుకు, సెప్టిక్ నిర్వహణకు, రూ.87.98 కోట్లతో జగనన్న కాలనీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుకు, రూ.8.40 కోట్లతో ఆరు నీటి ట్యాంకుల పునర్వ్యవస్థీకరణ పనులు చేపడతామని తెలిపారు. ఈ మేరకు త్వరలో పనులు మొదలు కానున్నాయన్నారు. అమృత్‌లో రూ.361.55 కోట్ల నిధులు ఏలూరుకు కేటాయించడంలో ఆళ్ల నాని చేసిన కృషికి పలువురు ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ర్యాగింగ్ నిరోధక అవగాహన సదస్సులు

ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాల ద్వారా ర్యాగింగ్ నిరోధక చర్యల్లో భాగంగా ఆగస్టు మొదటి, రెండు వారాల్లో వివిధ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులు ఈనెల 3, 7, 8, 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడో తేదీ ఉదయం 11 గంటలకు సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలోను, ఏడో తేదీన రామచంద్ర కళాశాలలో, ఎనిమిదో తేదీన ఆశ్రమం మెడికల్ కాలేజీలో, పదో తేదీన సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో, 11వ తేదీన ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కాలేజీలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

బుట్టాయగూడెం: కోట రామచంద్రపురం ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను తక్షణం భర్తీ చేయాలని, కళాశాల అభివృద్ధి కోసం ఐదు ఎకరాల పొలం సొంతభవనాలు, వసతి గృహ భవనాలు వెంటనే ఏర్పాటు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి ఎస్.రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ బుధవారం గిరిజన దర్బార్‌లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట రామచంద్రపురంలో 2014లో ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారని, ఈ కళాశాలలో తరగతి గదులు, వసతి గృహం భవనాలు లేవని, అధ్యాపకుల కొరత కూడా ఉందన్నారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో స్థానిక ఆదివాసీ గిరిజన విద్యార్థులు, దూర ప్రాంత విద్యార్థులు ఈ కళాశాలలో చేరేందుకు వెనుకాడుతున్నారన్నారు.

గోదావరి వరద బాధితులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు

గోదావరి వరద ముంపు వల్ల నష్టపోయిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల ప్రజలను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి అతిథిగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం పూర్తిగా కల్పించనందువల్లే ఈ వరద ముంపు వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసం పరిహారాన్ని పూర్తిగా చెల్లించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని డిమాండ్ చేశారు. గతేడాది వరదలకు ఇంతవరకూ పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదని, ఇప్పుడు మళ్లీ ఈ ఏడాది వరదలతో ముంపు గ్రామాల ప్రజలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గోదావరి వరద తగ్గుముఖం పడుతున్నా భవిష్యత్తులో వర్షాలు పడితే తిరిగి వరద ఉధృతమయ్యే పరిస్థితులు గత అనుభవంలో చూశామని గుర్తు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని, ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మౌలిక అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. వారంతా కొండలు, గుట్టలపై నివాసం ఉంటున్నారని అందుకు వారికి గుడారాలు ఏర్పాటు చేయాలని, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, సరిపడు తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. గతేడాది వరదల సందర్భంగా రేషన్‌కార్డుపై ఒక తాగునీటి ప్యాకెట్ ఇచ్చారని, ఇది అమానుషమని, ఈ ఏడాదైనా వరదల్లో చిక్కుకున్న బాధితులకు సరిపడు తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. వరద వల్ల పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ముంపుగ్రామాల ప్రజలకు చట్టబద్ధంగా అందించాల్సిన నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో అందించి, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నిర్వాసితులను తరలించడం ద్వారానే గోదావరి వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వరి పంటకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. పంట నష్టాలను వ్యవసాయ శాఖ వెంటనే నమోదు చేయాలని కోరారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.15 వేలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరితో పాటు ఇతర పంటల రైతులకు పరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు. వరద బాధిత ప్రజలను, రైతాంగాన్ని ఆదుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఎర్రకాలువ మిగులు భూములు, ప్రభుత్వ భుములు పేదలకు పంచాలని, అసైన్డ్, ప్రభుత్వ భూముల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అటవీ చట్ట సవరణ, జిఒ మూడును, మణిపూర్ ఘటన, నిర్వాసితుల సమస్యలపై ఏజెన్సీ ప్రాంతంలో ఈనెల మూడో తేదీన 'మన్యం బంద్'కు సిపిఎం పూర్తి మద్దతును ప్రకటిస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, జి.రాజు, మొడియం నాగమణి మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, తుమ్మల సత్యనారాయణ, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఎ.శ్యామలారాణి, వై.నాగేంద్రరావు, బి.సోమయ్య, గుడిపాటి నరసింహారావు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరులో పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టారు. అనంతరం ట్రాన్స్‌కో ఎస్‌ఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ప్రదర్శన స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ప్రారంభమై కొత్తబస్టాండ్, జిల్లా పరిషత్ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, డిసిసిబి కార్యాలయం మీదుగా విద్యుత్ భవన్‌కు చేరుకుంది. విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని, యాజమాన్యం మొండి వైఖరి వీడాలని పెద్దపెట్టున నినదించారు. ధర్నానుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ జె.శ్రీనివాసరావు, కో ఛైర్మన్ కె.సంజయ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కాంట్రాక్ట్ కార్మికులను, ఉద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్రలో మాట తప్పను - మడమ తిప్పనని వాగ్దానం చేసిన జగన్ అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా హామీలు అమలు చేయకుండా మాట తప్పారని విమర్శించారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఎన్నో సందర్భాల్లో పోరాటాలు చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు డైరెక్ట్ పేమెంట్ అమలు చేయడం వల్ల కార్మికులు లబ్ధి పొందారన్నారు. కానీ ఆంధ్రరాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు ద్రోహం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనంతో కాంట్రాక్ట్ కార్మికులు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ పర్మినెంట్ ఉద్యోగులకు పిఆర్‌సి గడువు ముగిసినా కొత్త పిఆర్‌సి ఇవ్వకుండా తాత్సారం చేస్తుందని విమర్శించారు. ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై పిట్టల్లా రాలిపోతున్నా, వారి కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజల మీద భారాలు వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం ధర్నా వద్దకు విచ్చేసిన డివిజనల్ ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి పోరాట కమిటీ నాయకులు కళ్యాణ చక్రవర్తి, కెఎల్‌ఎన్.రాజు, ఫజలుద్దీన్, పి.ప్రసాద్, బి.చంద్రశేఖర్, సత్యనారాయణ, రాంబాబు, మహేష్ నాయకత్వం వహించారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కృషి చేస్తున్నామని ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ ఇప్పటికే పలు కాలేజీల వద్ద అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. స్టేషన్ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. గంజాయి కేసుల్లో ఉన్న ముద్దాయిలపై సస్పెక్ట్ షీట్‌లను ఓపెన్ చేయాలని, అలాగే జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న రౌడీషీటర్ల వివరాలను, స్పీడ్ ట్రయల్ కేసులలో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సైబర్ నేరాలు, లోన్ యాప్ వల్ల జరిగే మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. పోలీసుస్టేషన్, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్, లాకప్ గదులను పరిశీలించి పోలీసు స్టేషన్లకు వచ్చే పిటిషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, అనవసరంగా ఎవర్నీ పోలీసు స్టేషన్లకు పిలిపించడం చేయరాదని సూచించారు. విధుల్లో భాగంగా పోలీసులు నిర్వహించే ప్రతి రికార్డునూ సమీక్షించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక నిఘ పెట్టాలన్నారు. తెలంగాణ మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని, ఇసుక, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, నాటు సారాతయారీ, అమ్మకం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమైన ప్రాంతాల్లోనూ, దుకాణాల వద్ద, దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం సిఐ కార్యాలయాన్ని పరిశీలించారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌పి

డ్రెయినేజీ నిర్మించండి

ప్రజాశక్తి - మండవల్లి

జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుత్తేదారుడు క్రమ పద్ధతిలో కాకుండా ఇష్టానుసారంగా నిర్మించడంతో, తాగునీటి పైపులైన్లు ధ్వంసం అయిపోయి గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టు నిర్వహిస్తున్న పనులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గ్రామస్తులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని వారు విమర్శిస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా గుత్తేదారుడు డ్రయినేజీ నిర్మాణ పనులను ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారు. విస్తరణ పనుల్లో భాగంగా స్థలాలు ఇళ్లు నష్టపోయిన వారికి నష్టపరిహారం అందించకుండా కాంట్రాక్టర్ దౌర్జన్యంగా డ్రయినేజీ నిర్మాణ పనులను చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై కార్యదర్శి తోట శ్రీనివాసరావును వివరణ కోరగా డ్రయినేజీ నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో కుళాయి పైపులు ధ్వంసం అయ్యాయని అన్నారు. అందువల్ల తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అన్నారు. మరమతులు చేయించి గ్రామస్తులకు నిరంతరం అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నష్టపరిహారం అందించండి : రైతులు

మండవల్లి: అధిక వర్షాల వల్ల పొలాల్లోకి చేరుకున్న నీటిని బయటకు తోడేసుకుంటే వరిని రక్షించుకోవచ్చునని ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఫణి కుమార్ తెలిపారు. మండలంలోని కానుకొల్లు గ్రామంలో సైంటిస్టుల బృందం బుధవారం పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధ్యమైనంత వరకూ నీటిని బయటకు తోడేయాలని అన్నారు. అనంతరం బూస్టర్ డోసుగా ఎకరాకు 20 కేజీల యూరియా 15 నుంచి 20 కేజీల పోటాష్ వెయ్యాలన్నారు. నాట్లు వేసే సమయం దాటిపోయిందని తాము పెట్టుబడి పెట్టి నష్టపోయామని, సబ్సిడీపై విత్తనాలు ఇవ్వడం వలన తమకు ఎటువంటి ఉపయోగం ఉండదని, ప్రభుత్వం తరపు నుంచి నష్టపరిహారం ఇప్పించాలా చర్యలు తీసుకోవాలని రైతులు శాస్త్రవేత్తల బృందాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.సుజాత, డాక్టర్ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పోలవరం డిఎస్‌పి

బుట్టాయగూడెం: పోలీసులు అంటే కఠినంగా ఉంటారని, అందుకే కొంత మంది పోలీస్ స్టేషన్ వెళ్లాలన్నా భయపడుతూ ఉన్నారు. కానీ పోలీసులు ప్రజల రక్షణకే కాకుండా వారి కష్టసమయంలోనూ తోడుగా నిలుస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరిస్తూ ఎవరికి ఏ కష్టమొచ్చినా మేమున్నామంటూ వస్తున్నారు. పోలవరం డిఎస్‌పి శ్రీనివాసులు బుధవారం ఉద్యోగ నిర్వహణ కొరకు బుట్టాయగూడెం వెళుతుండగా నందాపురం గ్రామ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న వంజం బాబురావు రోడ్ యాక్సిడెంట్‌కు గురై రోడ్డు ప్రక్కన పడి ఉండగా, పోలవరం డిఎస్‌పి శ్రీనివాసులు క్షతగాత్రుడికి సహాయం అందించి అతనిని 108 అంబులెన్స్‌పై వైద్యం కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్ఐకు అభినందనల వెల్లువ

ముదినేపల్లి: ఇటీవల ముదినేపల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన డి.వెంకటకుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణతో పాటు పలువురు వైసిపి నాయకులు ఎస్ఐకి శాలువ కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ముసునూరు: కుల, మత, వర్గ, తారతమ్యం లేకుండా అందరికీ సవరణల్లా పేదలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరలా ముఖ్యమంత్రి కావటం ఖాయమని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. బుధవారం మండలంలోని కొర్లగుంట గ్రామ పరిధిలో రైతు భరోసా కేంద్రం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం బిసి ఏరియాలోని మూడు సీసీ రోడ్లును, ఎస్‌సి ఏరియాలోని ఒక సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ ద్వారా సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చర్యలు చేపడుతున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ దేశంలో ఒక ప్రమాణికంగా ఉందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, జడ్‌పిటిసి వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి 2 పామల గంగాధర్ రావు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ : జెడ్‌పిటిసి

టి.నరసాపురం: సమగ్ర భూ సర్వే నిర్వహించి పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు భూ పంపిణీ చేస్తామని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాభీష్టం బద్ధంగా మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మండలంలోని అల్లంచర్ల, కొత్త గూడెం భూవివాదంలో అధికార పార్టీకి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. అల్లంచర్ల, రాజా పాలెం గ్రామంలో వివిధ క్షేత్రానికి కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కేతవరం గ్రామ పంచాయతీలో అంబేద్కర్ గురుకుల పాఠశాల నిర్మాణానికి 20 ఎకరాల భూమి కేటాయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మండలంలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని, ఆదేవిధంగా రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మడి తేజ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

సూరేపల్లి గ్రామంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి మోపెడ్ టివిఎస్‌పై నాటు సారా తరలిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారాని, మోపెడ్ టివిఎస్‌ను స్వాధీన పరుచుకున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ప్రసాద్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్య చంద్ర రావు యొక్క ఆదేశాల పై బుధవారం రాబడిన సమాచారం మేరకు పోలీస్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించామన్నారు. మోటార్ సైకిల్‌తో సహా నూజివీడు ఎస్ఇబి పోలీస్ స్టేషన్‌కు తగు చర్యలు తీసుకోవాలని అప్పగించినట్లు తెలిపారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పని లేకుండా జులాయిగా తిరుగుతున్న యువకుడిని తల్లిదండ్రులు పని చూసుకొని ఆర్జించగా స్థిరపడాలని తెలియజేయడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్ టౌన్ ప్రాంతానికి చెందిన వనం రాజు(20) డిగ్రీ చదివి ఏ పని చేయకుండా ఖాళీగా ఉన్నాడు. దీంతో తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు అతని తండ్రి నరసింహారావు ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ సిఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్ఐ రంజిత్ కుమార్ తెలిపారు. బుధవారం తెలంగాణాలోని సివిల్ సప్లయిస్ అధికారులతో కలిసి బోర్డర్ చెక్‌పోస్ట్ తనిఖీ కేంద్రం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో చింతలపూడి ఏరియా నుంచి జంగారెడ్డిగూడెం వైపుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లయిస్, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.సురేంద్ర, విఆర్ఒ బుజ్జిబాబు, విఆర్ఒ షరీఫ్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో చోరీ

నూజివీడు రూరల్ : ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో బుధవారం చోరీ జరిగింది. విజయవాడ నాన్‌స్టాప్ కౌంటర్ సమీపంలో దొంగిలించినట్లు బాధిత మహిళలు ఫిర్యాదు చేశారు. ముగ్గురు మహిళల లగేజ్ నుంచి దొంగలు రూ.34 వేల 800లు నగదు, రెండు బంగారు ఉంగరాలు, రెండు ఫోన్లు చోరీ అయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు. డిఎస్‌పి మేదేమ్ పవన్ కుమార్ సమాచారం తెలుసుకొని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు


భీమడోలులో తల్లిపాల వారోత్సవాలలో పాల్గొని మాట్లాడుతున్న గ్రామ ఉపసర్పంచి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల లబ్ధిని సద్వినియోగపరుచుకోవాలని గుండుగొలను గ్రామపంచాయతీ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు కోరారు. గుండుగొలను కేంద్రంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని గుండుగొలను సెక్టార్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ ఉపసర్పంచి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా వైస్ ఎంపిపి డి.వాసంతి, ప్రాజెక్ట్ సిడిపిఒ కె.విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచి మాట్లాడుతూ ఉద్యోగస్తులైన తల్లులు తాము పనిచేసే ప్రాంతాలలో పిల్లలకు తల్లిపాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ఇదే క్రమంలో గర్భిణీల కోసం ప్రత్యేకించిన వైఎస్ఆర్ పోషణ కిట్టు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నామని కోరారు. భీమడోలు ప్రాజెక్ట్ సిడిపిఒ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు 2023 కార్యక్రమం ఈనెల 7వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఉద్యోగస్తురాలైన తల్లులు తమ పిల్లలకు తల్లిపాలను ఇవ్వడం కొనసాగించేందుకు సహకరించాలని భాగస్వాములకు విజ్ఞప్తి చేశారు. బిడ్డ పుట్టిన తర్వాత ఆరునెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని, తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని రెండు సంవత్సరాల కాలానికి తక్కువ కాకుండా, ఆ తరువాత వారికి వీలైనంత కాలం వరకు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.కవిత, ఎఎన్ఎం ఇందిరతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాజామణి, ఎం.విజయలక్ష్మి, పద్మకుమారి, నాగమణి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

బిడ్డలకు పుట్టిన గంట తర్వాత తల్లిపాలు ఇస్తే బిడ్డలలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు తెలిపారు. ఆయన బుధవారం పూళ్లలోని వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పూళ్ళ పిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడుతూ దోమల వల్ల వ్యాధులు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి వల్ల కలిగే ఇబ్బందుల గురించి విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని కోరారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా దోమలను అదుపు చేసి డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చూడవచ్చని తెలిపారు. అనంతరం పూళ్ళ పురవీధుల్లో పిహెచ్‌సి అధికారులు, సిబ్బంది భాగస్వామ్యంతో నిర్వహించిన డెంగ్యూ వ్యాధి నివారణ ర్యాలీలో పాల్గొన్నారు.

కైకలూరు: గర్భిణీలు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద వారిఇళ్ల వద్దకే పౌష్టికాహార కిట్లను ప్రభుత్వం అందిస్తుందని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక సిఎన్‌ఆర్ గార్డెన్స్‌లో జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ఇంటికే రేషన్ పథకాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణితో కలిసి ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా ఇప్పటి వరకూ గర్భిణీలు, బాలింతలకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పౌష్టికాహారాన్ని అందజేసేవారని, ఇందులో ప్రభుత్వం మార్పులు చేసి వారి ఇళ్లవద్దకే పది రకాల పౌష్టికాహార వస్తువుల పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి పద్మావతి, డిఎస్‌పి సత్యనారాయణరాజు, ఆర్.సత్యనారాయణ, గ్రామ సర్పంచి జిల్లాలోని సిడిపిఒలు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దెందులూరు: వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణీ బాలింతలకెంతో గొప్ప వరమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీ కార్యాలయం ద్వారా పత్రికా ప్రకటన విడుదల చేశారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దూర దృష్టితో గర్భిణీలు, బాలింతలైన అక్కా, చెల్లెమ్మలు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రయాసపడి వెళ్లే బాధ లేకుండా ఏటువంటి ఆటంకాలు కలుగకూడదని తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ గర్భిణీలు, బాలింతలకు ఈ తరహా మేలు చేసిన ముఖ్యమంత్రి దేశంలోనే ఎవరు లేరన్నారు. జిల్లాలో వున్న 10 ప్రాజెక్టలలో 2,225 అంగన్‌వాడీ కేంద్రాల్లో 19,56 మంది గర్భిణీలు, బాలింతలకు వెసులుబాటును కల్పిస్తున్నామన్నారు. శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ఇస్తున్న పోషకాహార పదార్థాలను తీసుకొని గర్భిణీలు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంతో అభివృద్ధి చెందాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ఆకాంక్షించారు.


సీసీ రోడ్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపిటిసి..

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పాలచర్ల రాజవరం పంచాయతీ పరిధిలో బుధవారం రూ.40 లక్షల నిధులతో పలు సీసీ రోడ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఎంపిటిసి సున్నం సురేష్ తెలిపారు. గ్రామంలోని ఎస్‌సి పేటలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమ నిధుల నుంచి రూ.40 లక్షల బడ్జెట్‌ను కేటాయించి గ్రామంలోని పలు రోడ్లను కాంక్రీట్ రోడ్‌లుగా మార్చనున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సోయం కాంతమ్మ, బాబురావు, వైసిపి నాయకులు, వార్డు నంబర్‌లు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో జాతీయ నాయకుల విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీఅరవింద జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎస్ఎఎస్‌జిడిసి) 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న స్వర్ణోత్సవాలలో భాగంగా కాలేజీ ఆవరణలో 50 మంది జాతీయ నాయకుల విగ్రహాలని ప్రతిష్టించాలని కాలేజీ పూర్వ విద్యార్థి సంఘం, కళాశాల అధ్యాపకులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ విగ్రహాలని బహుకరిస్తామని ముందుకు వచ్చిన దాతలు అరవిందు, గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను కోనా శ్రీనివాసరావు, కోనా హనుమాన్ బాబు సోదరులు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. అలాగే బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని జి.హెబ్సిబా, మదర్ థెరిస్సా విగ్రహాన్ని బి.ఝాన్సీ లక్ష్మి, అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని సాగిరాజు జానకిరామరాజు, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని డాక్టర్ కొండా రవి, డాక్టర్ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఎలిశెట్టి శ్రీనివాసరావు, స్వామి వివేకానంద విగ్రహాన్ని పిఎస్ఎన్ఎస్‌వి ప్రసాద్, పింగళి వెంకయ్య విగ్రహాన్ని పిఎఎస్ మూర్తి, చత్రపతి శివాజీ విగ్రహాన్ని కూన అప్పారావులు ఆయా విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని పూర్వ విద్యార్థుల సంఘ సంతోషం వ్యక్తం చేశారు.

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

కోనేరు పేటలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌ను ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్య సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వరి పొలాలు పరిశీలన

ముదినేపల్లి: ఇటీవల మండలంలో కురిసిన భారీ అకాల వర్షాలు వల్ల ముంపుకు గురైన వరిపొలాలను బుధవారం వ్యవసాయాధికారుల బృందం పరిశీలించారు. మండలంలోని శ్రీహరిపురం, సింగరాయపాలెం గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు రైతులు పొలాల్లోని వర్షపునీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కనీస వేతనాలివ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి - చాట్రాయి

ఎఐసిటియు అనుబంధ ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెస్ మిడ్ డే మిల్ వర్కర్స్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెస్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాఠశాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చాట్రాయి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్ విశ్వనాథరావుకు వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐఎమ్ఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మికులను తీవ్ర అవస్థలకు గురి చేస్తుందని దుయ్యబెట్టారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ మార్పులు చేసి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను కేటాయించక పోవడం వలన మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు అప్పులు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మికులను, శానిటేషన్ కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతన చట్టం ప్రకారం కనీస వేతనాలు పెంచాలని, అలానే పెరుగుతున్న ఆహార ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, రేషనలైజేషన్ పేరుతో పాఠశాలలను విలీనం చేయడం వలన ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ఉపాధి భద్రత, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని, మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించాలనే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని, పనిచేసే ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థికి ఇస్తున్న మెనూ చార్జీ రూ.20లకు పెంచాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెసివ్ మిడ్ డే మిల్స్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి బిలుగూది ఆనందరావు, అధ్యక్షురాలు సిహెచ్ మల్లేశ్వరి, పసుపులేటి హరినాథ్, దేవరపల్లి వెంకటేశ్వరరావు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సభ్యులు కె.జోగారావు, ఎం.బాయమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు

ఆరోగ్యవంతమైన, నాణ్యమైన దిగుబడుల సాధనకు అవశేషాలు మిగలని పురుగు మందులు, ఎరువులను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వినియోగించాలని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భీమడోలులో మేలైన యాజమాన్య పద్ధతులపై పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న భీమడోలు సహాయ సంచాలకులు పొలంబడి క్షేత్రంలో సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. వారు లేవనెత్తిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం సహాయ సంచాలకులు మాట్లాడుతూ రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను అమలు చేయాలని కోరారు. నానో యూరియా, పచ్చి రొట్టె ఎరువుల వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన భీమడోలు వ్యవసాయ అధికారి ఎస్‌పివి ఉషారాణి మాట్లాడుతూ రైతులు మేలైన యాజమాన్య పద్ధతులలో భాగంగా ద్రవ జీవామృతం తయారీ గురించి ప్రత్యక్ష రూపంలో వివరించారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు రూపాదేవి, రామలక్ష్మి పాల్గొన్నారు.


మణిపూర్‌లో దారుణాలను ఖండిస్తూ 8న నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

మణిపూర్ మారణ హోమాన్ని ఖండిస్తూ ఈనెల ఎనిమిదో తేదీన భీమడోలులో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు మండల ప్రజా సంఘాలు, క్రైస్తవ, పాస్టర్ల, దళిత సంఘాల ఐక్యవేదిక తెలిపింది. ఈ మేరకు ఐక్యవేదిక కన్వీనర్ టి.సుమన్‌బాబు, మండల ఐక్య క్రైస్తవ వేదిక అధ్యక్షులు పాస్టర్ డివి.రత్నం పిలుపునిచ్చారు. ర్యాలీ సన్నాహక కార్యక్రమంలో భాగంగా బుధవారం గుండుగొలనులో ఐక్యవేదిక ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ వి.శ్యామ్ సుందర్ అధ్యక్షత వహించారు. అనంతరం వక్తలు మణిపూర్ సంఘటనలను ఖండిస్తూ ప్రసంగించారు. ఎనిమిదవ తేదీన నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీ భీమడోలు రైల్వే గేట్ వద్ద ప్రారంభమై జంక్షన్ వరకూ కొనసాగుతుందన్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి మణిపూర్ సంఘటనల బాధితులకు సంఘీభావం తెలిపా తహశీల్దార్‌కు వినతిని సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్య క్రైస్తవ వేదిక పాస్టర్ విజయ్ అచ్యుతం, పాస్టర్ యేసయ్య, పాస్టర్ విశ్వాస రావు, దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ప్రజాశక్తి - ముసునూరు


కలిదిండిలో పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తూ..

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు జరుపుకోవడం మన అదృష్టమని భారతీయ విద్యానికేతన్ ప్రిన్సిపల్ కొండేటి విజయలక్ష్మి శౌరి అన్నారు. బుధవారం మండలంలోని ముసునూరులో భారతి విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని కాటన్ పాడు గ్రామ సచివాలయం పరిధిలోని హరిచంద్రపురం ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.విజయలక్ష్మి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తమ పాఠశాల విద్యార్థులచే పింగళి వెంకయ్య భవిష్యత్తుపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కలిదిండి: జాతీయ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా మండలంలోని మట్టగుంటలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పింగళి వెంకయ్య తెలుగు వాడు కావడం తెలుగు జాతికే గర్వకారణమని టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. నాడు అనేక ఉద్యమాల్లో పాల్గొన్న పింగళి వెంకయ్య నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిసివైస్ ఛైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, గ్రామ కమిటీ అధ్యక్షులు కొపనాతి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

కాలిన వరికుప్పలకు నష్టపరిహారం అందించాలి

పోలవరం: కొత్త పట్టిసీమ గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం వరికుప్పలు కాలిపోయిన విషయం తెలిసిందే. ఆ వరికుప్పలకు నష్టపరిహారం అందజేయాలని పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్‌తో కలిసి కొత్త పట్టిసీమ రైతులు బుధవారం పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజును బుట్టాయగూడెం మండలం దుద్దుకూరు గ్రామంలో కలిసి వినతిని అందజేశారు. పండించిన పంట అగ్నికి ఆహుతై రైతులు తీవ్రంగా నష్టపోయారని వరికుప్పలు కాలిపోయిన రైతులు అందరూ అప్పుచేసి వ్యవసాయం చేసే చిన్న, సన్న కారు రైతులేనని, వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్‌లు ఎంఎల్‌ఎని కోరారు. తమకు న్యాయం జరిగే విధంగా చూస్తానని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు.

5, 6 తేదీల్లో నర్తనబాల-23 అవార్డుల మహోత్సవం

ఏలూరు :ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో 8వ జాతీయస్థాయి 'నర్తన బాల-2023' అవార్డుల మహోత్సవం ఆగస్ట్ 5, 6 తేదీలలో స్థానిక వైఎమ్‌హెచ్‌ఎ హాల్ నందు నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షులు అంబికా కృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షులు మనోహర్ గోపాల్ లునాని, వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక వంటి మూడు రాష్ట్రాలకు చెందిన చిన్నారులు పాల్గొని రెండు రోజులు ఉదయం 9 నుంచి సాయంత్రం 6.30 వరకూ రోజుకు 60 మంది చిన్నారులు మొత్తం 120 మంది వారి నాట్య కౌసల్యన్ని ప్రదర్శించి అవార్డులు అందుకోనున్నారు. నాట్య ప్రదర్శనలు చేస్తూనే పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది చిన్నారి నర్తకులకు విద్యా పురస్కారములు ఇవ్వనున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు మాజీ ఏలూరు ఎంఎల్‌ఎ శ్రీ ఆళ్ళనాని, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, ఏలూరు నగర మేయర్ శ్రీమతి షేక్ నూర్జహన్ పెదబాబు, శాసన మండలి సభ్యులు లయన్ వంకా రవీంద్రనాథ్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, మొదటి ఉప గవర్నర్ కాకరాల వేణుబాబు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు శ్రీమతి ఎస్‌పి.భారతి, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్బినేని విజయకుమార్, సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ అసోసియేషన్ ఫౌండర్ భావన పెదప్రోలు, సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శలా కోటివీరయ్య, మానవత నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖ కళాకారులు, లయన్స్ జిల్లా నాయకులు, మానవత, ఫ్లాష్ సేవా సంస్థల ప్రతినిధులు, కార్యక్రమంలో పాల్గొని వారి చేతులమీదుగా చిన్నారులకు అవార్డులు అందించనున్నారని నాట్యచార్య హేమసుందర్ తెలిపారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులపై నిలదీత

ప్రజాశక్తి - మండవల్లి

నష్టపరిహారం చెల్లించకుండా, పంచాయతీకి సమాచారం ఇవ్వకుండా ఎవరిని అడిగి డ్రయినేజీ నిర్మాణ పనులు చేపట్టారని మండవల్లి మండల విస్తరణ అధికారి కాంట్రాక్టర్‌పై ధ్వజమెత్తారు. మండవల్లిలో ఐదు నెలల తర్వాత తిరిగి ప్రారంభించిన డ్రయినేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించి అనంతరం డ్రయినేజీ నిర్వహణాధికారితో మాట్లాడారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించకుండా పనులు ఎందుకు ప్రారంభించారని ఆయన వారిని నిలదీశారు. పూర్తిస్థాయిలో నష్ట పరిహారం ఇవ్వకపోగా, డ్రయినేజీ నిర్మాణాన్ని ముక్కలు ముక్కలుగా ఏర్పాటు చేయమని మీకు ఎవరు సలహా ఇచ్చారని, ఇదేనా పనులు నిర్వహించే పద్ధతి అంటూ వారిని ప్రశ్నించారు. డ్రయినేజీ అసంపూర్తిగా వదిలేసిన దగ్గర నుంచి పనులు ప్రారంభించకుండా కొత్తగా స్టేషన్ రోడ్‌లో పనులు ఎలా ప్రారంభిస్తారన్నారు. ప్రజలను ఇబ్బందుల పాలు చేయాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు భాస్కరావు, కార్యదర్శి టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.30 లక్షల సిఎం సహాయ నిధి మంజూరు

ఉంగుటూరు: కాకర్లమూడి గ్రామానికి చెందిన కంచర్ల థామస్, సలోమి దంపతుల ఇద్దరు కవల పిల్లలకు(ఆడ, మగ) ఆరోగ్య నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి రూ.30 లక్షలు మంజూరయ్యాయి. వివరాల్లోకెళితే నెలలు నవమాసాలు నిండకుండానే ఏడవ నెలలో ప్రసవమైంది. దీంతో ఆ కవల పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. విజయవాడలోని రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. చికిత్సకు రూ.50 లక్షలు వైద్యం అవుతుందని డాక్టర్లు తెలిపారు. దీంతో ఆ పేద దంపతులు ఉన్న భూమిని అమ్మి వైద్యం చేయించుకున్నా ఇంకా ఆర్థిక ఇబ్బందులు తొలగలేదు. దీంతో ఎంఎల్‌ఎ వాసుబాబును సంప్రదించి సిఎం రిలీఫ్ ఫండ్ కోసం అభ్యర్థించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.30 లక్షలు సహాయాన్ని ఎంఎల్‌ఎ మంజూరు చేయించారు. బుధవారం కాకర్ల మూడిలో సలోమి, థామస్ గృహానికి వెళ్ళి ఇద్దరు కవలలను ఆరోగ్యాన్ని ఆరాతీసి చెక్కును అందజేశారు.

దమ్ము చక్రాలతో తిరిగితే చర్యలు

నూజివీడు రూరల్: ప్రధాన రహదారుల వెంబడి దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై సంచరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. నూజివీడులో బుధవారం ఆయన మాట్లాడుతూ దుక్కు దున్ని దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తే బంక మట్టి కారణంగా ద్విచక్ర వాహనాలు జారిపడుతున్నాయని అన్నారు. దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం అవుతాయని, రైతులు ఈ సూచనలు తప్పనిసరిగా పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

నూజివీడు రూరల్: వెంకటాద్రి పురం గ్రామంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని ఆయన అన్నారు.

భీమడోలుకు జూనియర్ కాలేజీ మంజూరు

భీమడోలు: మండలానికి మరొక ప్రభుత్వ అదనపు జూనియర్ కాలేజ్ మంజూరయ్యింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కో-ఎడ్యుకేషన్ తరహాలో పూళ్ళ హైస్కూలు కేంద్రంగా జూనియర్ కాలేజీ పనిచేస్తుందని ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి ప్రభాకర రావు తెలిపారు. ఈ నేపథ్యంలో పూళ్ళ హైస్కూల్‌ను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాలేజీ నిర్వహణకు గల సౌకర్యాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఇంటర్ ప్రాంతీయ తనిఖీ అధికారి తెలిపారు.

ఇంటింటికీ రెండు మొక్కలు

జంగారెడ్డిగూడెం: పట్టణాన్ని సుందరీకరణ చేయడానికి ఇంటింటికి రెండు మొక్కలు చొప్పున 20 వేల మొక్కలు పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు ఎంఎల్‌ఎ ఎలిజా తెలిపారు. బుధవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏలూరు రోడ్ జీడి గింజల ఫ్యాక్టరీ వద్ద నుంచి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ఎలిజా ప్రారంభించారు.